# కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం



బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఆలయాల అభివృద్ధి
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- బాన్సువాడ పట్టణంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

బాన్సువాడ, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సమన్యాయం చేశారని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, అయ్యప్ప ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మించిన సన్నిధానం, రూ.68 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని స్పీకర్ మంగళవారం ప్రారంభించారు. సంగమేశ్వర కాలనీలో రూ.25 లక్షలతో పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సమాజంలో రెండు రకాల మనుషులు ఉంటారని తెలిపారు. ఒకరు డబ్బున్న వారు.. మరొకరు డబ్బు లేనివారన్నారు. డబ్బున్న వారికి ప్రభుత్వంతో పని ఉండదన్నారు. పేదలు, అట్టడుగువర్గాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముదిరాజ్ కులస్తులో నిరుపేదలైన 200 పైచిలుకు కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేశానని తెలిపారు. ఇంకా పేద వారు ఉంటే గృహలక్ష్మి ద్వారా అందిస్తామని తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గంలో సుమారు రూ.150 కోట్లు ఆలయాల అభివృద్ధికి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో గురుస్వాములు, ఆలయకమిటీ సభ్యులు స్పీకర్‌ను సన్మానించారు. ముదిరాజ్ సంఘం సభ్యులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్పీకర్ సతీమణి పుష్పమ్మ, సోదరుడు పరిగె శంభురెడ్డి, ఎంఈవో నాగేశ్వర్ రావ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం



బ్రహ్మణపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్
- తాడ్వాయిలో రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- క్రీడాకారులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

తాడ్వాయి అక్టోబర్ 3 : మారుమూల పల్లెలను సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని 16 గ్రామాల్లో రూ. 18.90 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవా లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిందే పేద ప్రజల సంక్షేమం కోసమన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్నారని.. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చి రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

**గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక క్యాక్రమాలను చేపడుతున్నదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ప్రభుత్వం మంజూరు చేసిన ఆట వస్తువులను క్రీడాకారులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి స్కూల్స్ గేమ్స్‌లో భాగంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని.. ఓటమి చెందిన వారు గెలుపుకోసం తిరిగి ప్రయత్నించాలన్నారు. తాను కూడా ఎన్నికల్లో ఎన్నోసార్లు ఓటమి చెందినా కుంగిపోలేదన్నారు. కష్టపడి ప్రయత్నించడంతో గెలిచానన్నారు.

# పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి



బస్వాపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభిస్తున్న విప్ గంప గోవర్ధన్

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- భిక్కనూర్ మండలంలో సుమారు రూ.15 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

భిక్కనూరు, అక్టోబర్ 3 : గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మండంలోని బస్వాపూర్ గ్రామంలో రూ.13.36 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ. 3.15 కోట్లతో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు, రూ. 2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, రూ. కోటీ 35 లక్షలతో పూర్తి చేసిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, రూ. కోటీ 14 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల అదనపు గదులను విప్ ప్రారంభించారు. దేవాలయాలు, వివిధ కుల సంఘాలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో రూ. 4.19 కోట్లతో పలు అభివృద్ధి పనులను విప్ ప్రారంభించారు. రూ. 3 కోట్లతో నిర్మించిన బ్రిడ్జి, సీసీ రోడ్లు, వివిధ కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు, ప్రాథమిక పాఠశాల నూతన భవనం, సింగిల్ విండో గోదాములను ప్రారంభించారు.

# కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి



పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- ఆర్మూర్ అభివృద్ధిలో ఈ రెండు పార్టీల పాత్ర నయా పైసా లేదు
- ఇంత ప్రగతి కేసీఆర్ పుణ్యమే
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 3 : ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నమస్తే నవనథపురం కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని హౌసింగ్‌బోర్డ్, గణేశ్‌నగర్, విద్యానగర్ కాలనీల్లో ప్రజా ఆశీర్వాద యాత్రను మంగళవారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.....ఆర్మూర్ అభివృద్ధిలో కాంగ్రెస్, బీజేపీల పాత్ర నయా పైసా లేదని స్పష్టం చేశారు. ఆర్మూర్ పట్టణం 2014కు ముందు ఎట్లుంది? ఇప్పుడెట్లుందని రూ.3వేల కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ ,బీజేపీలకు ఓట్లు తప్ప జనం పాట్లు పట్టవని ధ్వజమెత్తారు. ఒక్క బీఆర్ఎస్సే తెలంగాణ మేలు కోరే పార్టీ అని , తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారని ప్రజామద్దతుతో మళ్లీ బీఆర్ఎస్ గెలుస్తుందని అన్నారు. ఉద్యమ చరిత్ర తప్ప రాజకీయ నేపథ్యం లేనోడినని మూడో సారి ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని జీవన్‌రెడ్డి కోరారు ఈ సందర్భంగా కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

**కాంగ్రెస్, బీజేపీలకు సింగిల్ డిజిటే**

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి అని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం నందిపేట మండల కేంద్రానికి చెందిన మాదిగ సంఘం సభ్యులు, కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు (గుండు సంఘం) సభ్యులు, డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ మాల సంఘం సభ్యులు తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకేనని తెలుపుతు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.....ఓట్ల కోసం చిత్ర విచిత్ర విన్యాసాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ దసరా వేషగాళ్ల మాయలో పడవద్దన్నారు. తెలంగాణలో మూడో సారి కేసీఆర్ సీఎం కాకుండా ఏ శక్తి ఆపలేదని , కాంగ్రెస్, బీజేపీలకు సింగిల్ డిజిట్ రావడం కష్టమేనన్నారు. ఆర్మూర్ అభివృద్ధిపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. ప్రజలంతా కలిసి తనను ఏకపక్ష విజయాన్ని అందించాలని జీవన్‌రెడ్డి కోరారు.

# అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్, బీజేపీలు



రమేశ్‌కు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే షిండే

- సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి
- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- పిట్లంలో రూ.42 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

పిట్లం/పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్, అక్టోబర్ 3: సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. మండలంలో సుమారు రూ.42 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాతే మండల కేంద్రంలో 50 పడకల దవాఖాన మంజూరు చేసి నిర్మించుకుంటున్నామన్నారు. మండలంలో ప్రతి గుంటకూ సాగునీరు అందించేందుకు రూ.476 కోట్లతో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాలను ధ్వం సం చేయడం విడ్డూరమని, బీజేపీ నాయకురాలు అరుణతార, కాంగ్రెస్ నాయకుడు గంగారాం కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలన్నారు. ప్రజల కో సం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

పెద్దకొడప్‌గల్ మండలంలోని సీతారాంనగర్ తండాలో 20 కుటుంబాల వారు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే షిండే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా జుక్కల్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వసరే రమేశ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం బిచ్కుంద ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ఆయనకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.